క్లుప్తంగా

విద్యుత్ తీగలను అల్లుకున్న నిర్లక్ష్యం



విద్యుత్ తీగలను కమ్మేసిన చెట్ల కొమ్మలు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ తీగలను చెట్ల కొమ్మలు అలుకుపోయాయి. మండల పరిధిలోని చండి గ్రామం నుంచి చండికాంబ ఆలయానికి వరకు ఉన్న విద్యుత్ లైన్ చెట్ల కొమ్మలు అల్లుకపోయాయి. వర్షం కురిసినప్పుడు చెట్టును ముట్టుకుంటే విద్యుత్ షాక్ వస్తుందని గ్రామస్తులు ఆరోపించారు. ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయాలని పలుమార్లు విద్యుత్ సిబ్బందికి చెప్పినా.. పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఈ విషయం గురించి విద్యుత్ లైన్‌మెన్ సాయి దృష్టికి తీసుకెళ్లగా.. నా దృష్టికి రాలేదని పరిశీలించి చెట్లకొమ్మలను తొలగిస్తామని చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కండువాలు కప్పి పార్టీలో చేర్చుకుంటున్న పార్టీ నేతలు

నర్సాపూర్: మండల పరిధిలోని దంతాన్‌పల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిల ఆధ్వర్యంలో పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తమ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నందున ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్‌లు చెప్పారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మల్లేశ్, శివ్వంపేట ప్యాక్స్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షురాలిగా సుజాత

రామాయంపేట(మెదక్): ముదిరాజ్ మహాసభ మెదక్ జిల్లా అధ్యక్షురాలిగా సుజాత ఎంపికయ్యారు. ఈమేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టి రాజు ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి వీరేశ్ ఆదివారం రామాయంపేటలో ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి సంఘం పతిష్టతకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా నాగరాజు



చేగుంట(తూప్రాన్): పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాష్ట్ర నాయకులు వెంకట్‌రాంరెడ్డి జిల్లా నాయకులు విజయసేనారెడ్డి పీఆర్టీయూ టీఎస్ నాయకులతో మక్కరాజీపేటలో సమావేశం నిర్వహించి మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా తిరుపతిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా కనకయ్య, మహిళా ఉపాధ్యక్షుడిగా స్వప్న, కార్యదర్శిగా రాజిరెడ్డి, మహిళా కార్యదర్శిగా సుమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అమర్‌శేఖర్‌రెడ్డి, గంగాబాయి, శ్రీనివాస్, రామకృష్ణ, మహేదర్‌రెడ్డి, మురళీకృష్ణ, శంకర్, స్వప్న, శ్రీదేవి, గోవింద్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణిని వినియోగించుకోండి

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో భూ సమస్యలను పరిష్కరిస్తామని, ఇతర సమస్యలను ఆయా శాఖల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఏపీఎం వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. మహిళా సమాఖ్య 16వ మహాసభ వార్షికోత్సవాలకు డీఆర్‌డీఏ పీడీ, ఇతర అధికారులు హాజరవుతున్నట్లు చెప్పారు. గ్రామ సంఘాల లీడర్లు పూర్తి సమాచారంతో సభకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

శివ్వంపేటలో లోపిస్తున్న పారిశుద్ధ్యం

● చెత్త డంపు చేసేందుకు స్థలం కరువు ● కంపు కొడుతున్న కాలనీలు ● పట్టించుకోని అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): ఇకవైపు దోమలు.. మరో వైపు దుర్గంధంతో కాలనీలు కంపు కొడుతున్నాయి. మండల కేంద్రం శివ్వంపేటలో ఇళ్ల వద్ద నుంచి సేకరిస్తున్న చెత్తను డంపు చేసేందుకు స్థలం లేకపోవడం గ్రామంలో పారిశుద్ధ్యం లోపిస్తుంది. స్థల కొరతతో రోజు వారీగా చెత్త సేకరణ నిలిచిపోయింది. దీంతో కాలనీలు కంపు కొడుతున్నాయి. చెత్త సేకరణ నిలిచిపోవడంతో నెల రోజుల క్రితం సాక్షి దినపత్రికలో సమస్యపై కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు ఇళ్ల వద్ద నుంచి చెత్త సేకరణ చేపట్టాలని స్థలాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటికీ రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ భూమి చూపించక పోవడంతో రెండు రోజులకు ఓ సారి సేకరిస్తున్న చెత్తను గ్రామ పంచాయతీ సిబ్బంది రోడ్ల పక్కన వేస్తుండడంతో పాటు పలు చోట్ల తగులబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతీ ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. కానీ అమలు చేయడంలో నిర్లక్ష్యధోరణి అవలంభిస్తున్నారు.



గ్రామ శివారు తూప్రాన్ - నర్సాపూర్ హైవే పక్కన వేసిన చెత్త

జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి

మండల కేంద్రం శివ్వంపేటలో చెత్త సేకరణ కోసం తలెత్తిన భూ సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉంది. డంపుయార్డు కోసం స్థలం లేకపోవడంతో ఇళ్ల నుంచి సేకరిస్తున్న చెత్త నిలిచిపోవడం వల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. స్థల కేటాయింపు చేసి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తగులబెట్టిన చెత్త

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి ప్రయత్నించిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. శివ్వంపేటలో తూప్రాన్ – నర్సాపూర్ హైవే పక్కన ఉన్న ఇండియన్ బ్యాంకు ఏటీఎంలోకి శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చోరబడి పలు వైర్లు తొలగించి చోరీకి ప్రయత్నిస్తుండగా.. అల్లారం మోత మోగడంతో సదరు వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏటీఎం వద్దకు వచ్చి పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం ఏటీఎంను మూసేశారు. సీసీ కెమెరాల ఆధారంగా చోరీకి ప్రయత్నించిన వ్యక్తిని గురించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



చోరీకి ప్రయత్నించడంతో మూతబడ్డ ఏటీఎం

భగీరథ పైపులైన్ లీకేజీ

వృథాగా పోతున్న తాగునీరు

అల్లాదుర్గం(మెదక్): మిషన్ భగీరథ పైపు లీకేజీ కావడంతో తాగు నీరు వృథాగా పోతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని గడిపెద్దాపూర్ రైస్‌మిల్ వద్ద మిషన్ భగీరథకు చెందిన పెద్ద పైపులైన్ లీకేజీ అవుతుంది. లీకేజీ ప్రాంతంలో చికెన్ సెంటర్, చిన్న హోటల్ ఉంది. పైపు పగిలితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపు లీకేజీతో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరుతుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గడిపెద్దాపూర్ వద్ద లీకేజీ అవుతున్న భగీరథ పైపు

బార్లుగా మారుతున్న దాబాలు

● పట్టించుకోని పోలీస్, ఎక్సైజ్ అధికారులు
● 161 హైవేపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

అల్లాదుర్గం(మెదక్): ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు మద్యం తాగడమే ప్రధాన కారణమని పోలీసులు చెబుతున్నారు. అక్రమ మద్యం అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమావేశాల్లో హెచ్చరిస్తున్నారు. 161 జాతీయ రహదారిపై ఉన్న దాబాలు బార్లుగా మారుతున్నా.. ఎవరు పట్టించుకోవడం లేదు. డాబాల్లో మద్యం సేవించి ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అల్లాదుర్గం పోలీస్ సర్కిల్ పరిధిలోని 161 జాతీయ రహదారిపై ఉన్న డాబాల్లో నిత్యం మద్యం సేవిస్తున్నారు. దాబాలు బార్లు మారుతున్నా.. పట్టించుకునే వారే దిక్కు లేరు. పెద్దశంకరంపేట నుంచి గడిపెద్దాపూర్ వరకు 161 రహదారిపై దాబాలు, రెస్టారెంట్లు ఉన్నాయి. ఇవి బార్లుగా మారుతున్నాయి. దాబాలు, రెస్టారెంట్లలో మద్యం సేవించి ప్రమాదాలకు గురవుతున్నారు. గడిపెద్దాపూర్ శివారలో ఒక ద్విచక్ర వాహనంపై నలుగురు ప్రయాణిస్తే రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా.. దాబాలపై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే రహదారిపై కల్తీ కల్లు సహితం విక్రయిస్తున్నారు. కల్లు సేవించేందుకు వాహనాలకు ఇష్టం వచ్చినట్లు రహదారిపై అపడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకొని ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

బీడీ కార్మికులకు జీవనభృతి చెల్లించాలి

నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యం

రామాయంపేట(మెదక్): పీఎఫ్ లేని బీడీ కార్మికులకు జీవనభృతి కల్పించాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యం డిమాండ్ చేశారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన రామాయంపేటలో మాట్లాడుతూ.. తాము అధికారంలోకి రాగానే పింఛన్లను పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ఇంటికి ఒకే పింఛన్ అనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకొని అర్హులందరికీ ఫించన్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లను పెంచడంతో పాటు కొత్త వారికి అవకాశం కల్పించాలని సత్యం డిమాండ్ చేశారు.

రామాచారికి కిన్నెర, బాలు పురస్కారం



రామాచారి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు రామాచారికి కిన్నెర, బాలు పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 24న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా రామాచారి పురస్కారం అందుకోనున్నారు.

విద్యార్థిని కుటుంబానికి ఆర్థిక సాయం

హవేళిఘణాపూర్(మెదక్): అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి సర్దన ప్రభుత్వ ఉద్యోగులు కలిసి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండల పరిధిలోని సర్దన గ్రామానికి చెందిన పిల్లి భాగ్య, కృష్ణ దంపతుల పెద్ద కుమార్తె వర్ష 10వ తరగతి చదువుతోంది. ఇటీవల ఆమె అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ ప్రభుత్వ ఉద్యోగులు కలిసి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆటపాటల్లో చురుకుగా పాల్గొనే వర్ష మృతి తీరని లోటని వారు పేర్కొన్నారు.



మండల నోడల్ అధికారి మృతి

టేక్మాల్(మెదక్): మండలంలోని కుసంగి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు (మండల నోడల్ అధికారి) గా పని చేస్తున్న విశ్వనాథం ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట వాస్తవ్యులైనా విశ్వనాథం గతేడాది చిన్నశంకరంపేట నుంచి కుసంగి పాఠశాలకు బదిలీపై వచ్చారు. పదిహేనురోజులుగా అనారోగ్యానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. విశ్వనాథం పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా కూడా పని చేస్తున్నారు. పీజీ హెచ్‌ఎంగా, మండల నోడల్ అధికారిగా పని చేస్తున్న ఆయన మృతి తీరనిలోటని మండల అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.



విశ్వనాథం(ఫైల్)

కార్పొరేషన్ ఏర్పాటు చేయండి



చంద్రం

దుబ్బాకటౌన్: ఆంధ్రప్రదేశ్‌లో లాగానే ఇక్కడ కూడా మాజీ సైనికుల సంక్షేమం కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని మాజీ సైనికుల రిజర్వేషన్ కోటా ఐదు శాతానికి పెంచాలని రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీల చంద్రం డిమాండ్ చేశారు. ఆదివారం రాయపోల్‌లో ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దు రక్షణలో భాగమై రిటైర్ అయిన మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

భవిషత్ కార్యాచరణ

మిరుదొడ్డి(దుబ్బాక): మాలలపై జరుగుతున్న అన్యాయాలను ఎదించడానికి భవిషత్ కార్యాచరణ రూపొందిస్తున్నామని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ బోరబండలోని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సెంటర్‌లో బుధవారం జాతీయ మాల మహానాడు రాష్ట్ర విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని జిల్లాల నుంచి నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధారస్వామి, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు రాజేశ్ పాల్గొన్నారు.

ముగిసిన వినాయక నిమజ్జన వేడుకలు



మనోహరాబాద్(తూప్రాన్): జీడిపల్లిలో వినాయకుడి వద్ద వేడుకల్లో శివాజీ యూత్ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): వినాయక నవరాత్రుల్లో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకులను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిమజ్జనాలు నిర్వహించారు. ఆదివారం జీడిపల్లి, కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి, పర్కిబండ, రంగాయపల్లి గ్రామాల్లో యువకులు తమ వినాయకుల శోభాయాత్ర వినూత్నంగా చేశారు. కాళ్లకల్‌లో శివాజీ సేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద లడ్డూల వేలం పాట నిర్వహించగా రెండు లడ్డూలను గ్రామానికి చెందిన ఎర్రోల వెంకటేష్ దక్కించుకున్నారు. ఒకటి రూ. 2 లక్షల 71 వెయ్యికి, మరో లడ్డూను రూ. 2లక్షల 16 వేలకు దక్కించుకున్నారు.

బీకొండాపూర్‌లో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగంట ఎస్సీ కాలనీ బీ.కొండాపూర్ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుల నిమజ్జనం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీకొండాపూర్ మాజీసర్పంచ్ బాలనర్సు, మాజీ ఎంపీటీసీ నవీన్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల పూజలు



నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చన చేశారు. బోనాలు తీసి, ఒడిబియ్యం పోశారు. దీంతోపాటు పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి లక్ష పుష్పార్చన

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయం కృత్తిక మహోత్సవంతో అలరారింది. ఆదివారం తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో వేదపండితులు స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి లక్షపుష్పార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చండిలో మట్టి తవ్వకాలు

శివ్వంపేట(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు శిఖం భూముల్లో నుంచి మట్టి తవ్వకాలు దర్జాగా చేస్తున్నారు. మండల పరిధిలోని చండి గ్రామ పరిధిలోని లోతన్ చెరువు శిఖం భూమిలో రెండు రోజుల నుంచి జేసీబీతో మట్టి తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పలువురు వ్యాపారులు మట్టి తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులకు తెలిసిన చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. మట్టి రవాణాతో ఓ చోట డంపు చేస్తున్నారన్నారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్తులు ఆదివారం చెరువు వద్దకు వెళ్లగా.. మట్టి వ్యాపారులు జేసీబీ, ట్రాక్టర్లతో ఉడయించారు. మట్టి తవ్వకాల గురించి ఇరిగేషన్ ఏఈ సునీత వివరణ కోసం ఫోన్ చేస్తే అందుబాటులోకి రాలేదు.



లోతన్ చెరువులో మట్టి తవ్వగా ఏర్పడిన గుంత

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తూప్రాన్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు



చిన్నశంకరంపేటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 2005–06 చదువుకున్న 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రాధేశ్యామ్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నలంద కళాశాలలో..

తూప్రాన్: తూప్రాన్ నలంద జూనియర్ కళాశాల 2004–06 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పీబీ రమణ, ఇన్‌చార్జి రవీందర్, ఉపాధ్యాయులు సంజీవ్, మురళీకృష్ణ, హరీశ్ పాల్గొన్నారు.



వెల్దుర్తి(నర్సాపూర్): గురువులతో పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి(నర్సాపూర్): మండల కేంద్రం వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 1970–80లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ కలుసుకొని ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించారు. 45 సంవత్సరాల తర్వాత స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. పూర్వ విద్యార్థులు వారి జ్ఞాపకాలను, కష్టసుఖాలను పంచుకున్నారు. పదో తరగతిలో చేసిన అల్లరి, ఆట పాటలను చెప్పుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిష్టారెడ్డి, వెంకటేశం, ఇమ్మానియల్, వెంకటరమణ, పూర్వ విద్యార్థులు అశోక్, శంకరయ్య, గోపాల్, సత్యనారాయణ, లచ్చిరెడ్డి, ఖాజీమోహినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల ప్రత్యేక పాలనలో చిత్తశుద్ధి లేక ఆయా గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోతున్నాయి. వీధుల్లో పేరుకు పోతున్న చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా పంచాయతీల్లో చిల్లిగవ్వ లేదని ప్రత్యేక పాలనాధికారులు చేతులెత్తేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో పేరుకు పోతున్న చెత్త కుప్పలను, పెరిగి పోతున్న పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. మిరుదొడ్డి(దుబ్బాక):